క్లుప్తంగా

అభినందనలు

కుత్బుల్లాపూర్: దూలపల్లిలోని శ్రీసీతారామ చంద్ర విశాలాక్షి విశ్వేశ్వర ఆలయ అధ్యక్షుడిగా ఎన్నికైన బూర్గుబావి సత్యనారాయణకు మంగళవారం అభినందనలు వెల్లువెత్తాయి. దూలపల్లి ప్రాంతానికి చెందిన పలువురు కౌన్సిలర్లు, వివిధ పార్టీల నాయకులు ఆయనను కలిసి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా సత్యనారాయణ మాట్లాడుతూ.. ఆలయాభివృద్ధికి తన వంతు శాయశక్తులా కృషి చేస్తానని.. అందరి సలహాలతో ముందుకు సాగుతానన్నారు.

అన్నదానం



కుత్బుల్లాపూర్: జీడిమెట్ల డివిజన్ పేట్‌బషీరాబాద్‌లోని శ్రీకట్ట మైసమ్మ ఆలయం వద్ద మంగళవారం అన్నదానం నిర్వహించారు. రాకేష్, సంజయ్ వర్మ ఆధ్వర్యంలో అన్నదానం ఏర్పాటు చేయగా ఆలయ ప్రతినిధి వివేక్‌రెడ్డి, సభ్యులు సోమరాజు ఏర్పాట్లు చేశారు. అంతకుముందు కట్ట మైసమ్మను పెద్ద సంఖ్యలో భక్తులు దర్శించుకుని అభిషేకం నిర్వహించారు.

పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలి



అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్న ఎంటమాలజీ సిబ్బంది

జగద్గిరిగుట్ట: ప్రపంచ మలేరియా దినోత్సవం సందర్భంగా డివిజన్ పరిధిలోని పలు కాలనీలలో మంగళవారం జీహెచ్‌ఎంసీ ఎంటమాలజీ సిబ్బంది అవగాహన ర్యాలీ నిర్వహించారు. నీరు ఎక్కువ రోజులు నిల్వకుండా చూస్తే దోమల బారి నుంచి తప్పించుకోవచ్చని, ఇంటి చుట్టు పక్కల పరిశుభ్రంగా ఉండేలా చూడాలని సిబ్బంది కోరారు. ఈ అవగాహన ర్యాలీలో ఎంటమాలజీ సిబ్బందితో పాటు స్థానిక ప్రజలు కూడా పాల్గొన్నారు.

రంగారావుకు జాతీయ సాహిత్య పురస్కారం



కుత్బుల్లాపూర్: మెదక్ జిల్లా పటాన్‌చెరులో ఈనెల 30వ తేదీన తెలుగు వెలుగు సాహిత్య వేదిక, ఎస్‌వీ ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న జాతీయ సాహిత్య సంబరాలు పురస్కారాల కోసం కుత్బుల్లాపూర్ నియోజకవర్గ పరిధిలోని కొంపల్లి సాయికృపా అపార్ట్‌మెంట్‌లో ఉండే కవి, రచయిత ఊటుకూరు రంగారావుకు ఆహ్వానం లభించింది. ఉగాది సాహితీ సంబరాల సంకలనంలో తన కవిత ఎంపిక జరిగిందన్నారు. అందుకుగాను జాతీయ సాహిత్య పురస్కారం ప్రదానం చేయనున్నట్లు పేర్కొన్నారు.

యువతిపై దాడిని అడ్డుకున్న వారికి సన్మానం

అమీర్‌పేట: బోరబండ బంజారానగర్‌లో నడిరోడ్డుపై ఓ ప్రేమోన్మాది కత్తితో యువతిపై చేసిన దాడిని అడ్డుకుని ప్రాణాలు కాపాడిన వ్యక్తులను ఎస్‌ఆర్‌నగర్ పోలీసులు సన్మానించారు. ప్రేమకు నిరాకరించిందన్న కోపంతో కిషోర్, లక్ష్మి అనే యువతి కళ్లల్లో కారం కొట్టి కత్తితో గొంతు కోసిన విషయం తెలిసిందే. కత్తితో మరోసారి వేటు వేసేందుకు ప్రయత్నిస్తుండగా అక్కడే ఉన్న మారుతి, రాథోడ్ శంకర్, రాథోడ్ రాజీ నాయక్, సయ్యద్ అజర్‌అలీ, ఆకాష్ అడ్డుకున్నారు. కిషోర్ చేతిలోని కత్తి చూపిస్తూ బెదిరించినా ధైర్యంతో ముందుకు వెళ్లి పట్టుకున్న సదరు వ్యక్తులను ఎస్‌ఆర్‌నగర్ ఇన్‌స్పెక్టర్ సైదులు, ఎస్సై ఆంజనేయులు అభినందించి సన్మానించారు. కళ్ల ముందు జరిగే ఇలాంటి దాడులను ఎవరూ ఉపేక్షించరాదన్నారు.

టాయిలెట్ క్లీనింగ్ మిషన్ వితరణ

సనత్‌నగర్: ఎస్‌ఆర్‌టీకాలనీలోని ప్రభుత్వ రౌండ్‌టేబుల్ పాఠశాలకు బీజేపీ నాయకులు టాయిలెట్ క్లీనింగ్ మిషన్‌ను అందజేశారు. కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి సహకారంతో సమకూర్చిన మిషన్‌ను మంగళవారం అమీర్‌పేట కార్పొరేటర్ కేతినేని సరళ చేతుల మీదుగా అందజేశారు.

27 నుంచి సప్తదశ వార్షికోత్సవాలు

కేపీహెచ్‌బీకాలనీ: కేపీహెచ్‌బీకాలనీలోని శ్రీవాసవీ కన్యకాపరమేశ్వరి దేవస్థానంలో ఈనెల 27 నుంచి 30వ తేదీ వరకు సప్తదశ వార్షికోత్సవాలు, జన్మదిన ప్రత్యేక పూజలు నిర్వహించనున్నట్లు ఆలయ ఫౌండర్, చైర్మన్ మేనేజింగ్ ట్రస్టీ కుమారస్వామి ఓ ప్రకటనలో తెలిపారు.

బీఆర్‌ఎస్‌కు కార్యకర్తలే ఊపిరి

- ఘనంగా బీఆర్‌ఎస్ ఆవిర్భావ దినోత్సవం
- గులాబీమయంగా మారిన సభా ప్రాంగణం





సభకు హాజరైన బీఆర్‌ఎస్ కార్యకర్తలు



కార్యకర్తలను ఉద్దేశించి మాట్లాడుతున్న ఎమ్మెల్యే వివేకానంద్..



సభాస్థలి వద్ద రిజిస్టర్‌లో సంతకం చేస్తున్న ఎమ్మెల్యే వివేకానంద్



తెలంగాణ తల్లి చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్సీ శంబీపూర్‌రాజు



అమరవీరుల స్థూపానికి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే వివేకానంద్



ప్రభుత్వ విప్ శంబీపూర్‌కు జ్ఞాపికను అందజేస్తున్న ఎమ్మెల్సీ రాజేశ్వర్‌రెడ్డి, ఎమ్మెల్యే వివేకానంద్

కుత్బుల్లాపూర్: కుత్బుల్లాపూర్ నియోజకవర్గ వ్యాప్తంగా జెండా పండుగ నిర్వహించారు. బీఆర్‌ఎస్ ఆవిర్భావ దినోత్సవంలో భాగంగా అయోధ్య నగర్‌లో ఎమ్మెల్యే వివేకానంద, ప్రభుత్వ విప్ ఎమ్మెల్సీ శంబీపూర్ రాజు దుండిగల్ మున్సిపాలిటీ పరిధిలోని పార్టీ కార్యాలయం వద్ద, మాజీ ఎంపీపీ సన్న కవిత కొంపల్లి మున్సిపాలిటీలో, నిజాంపేట మేయర్ నీలారెడ్డి పార్టీ జెండా ఎగురవేశారు. అనంతరం ర్యాలీగా కుత్బుల్లాపూర్ మున్సిపల్ చౌరస్తా వద్ద నిర్వహించిన ప్రతినిధుల సభకు హాజరయ్యారు. కుత్బుల్లాపూర్ డివిజన్ నుంచి మాజీ కార్పొరేటర్ గౌరీష్ ఆధ్వర్యంలో కార్యకర్తలు భారీ ర్యాలీగా సభా వేదిక వద్దకు చేరుకున్నారు.



సంస్కృతిక నృత్య ప్రదర్శనలు చేస్తున్న కళాకారులు..

వేలాదిగా తరలి వచ్చిన కార్యకర్తలు..

వేలాదిగా తరలివచ్చిన కార్యకర్తలను కట్టడి చేసేందుకు బాచుపల్లి, దుండిగల్, జీడిమెట్ల, జగద్గిరిగుట్ట పోలీసుల ఆధ్వర్యంలో భారీ బందోబస్తు ఏర్పాటు చేసి భోజనాలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా మహిళలకు, పురుషులకు వేర్వేరుగా వడ్డించారు. సమావేశానికి హాజరైన కార్యకర్తలకు బ్యాగులను అందజేశారు. మున్సిపల్ గ్రౌండ్ మొత్తం పండుగ వాతావరణం కల్పించే విధంగా ఏర్పాట్లు చేశారు.

ఆకట్టుకున్న ఫొటో గ్యాలరీ

◆ రైతుబంధు సమితి రాష్ట్ర అధ్యక్షులు, జిల్లా బీఆర్‌ఎస్ పార్టీ ఇన్‌చార్జ్, ఎమ్మెల్సీ డా.పల్లా రాజేశ్వర్ రెడ్డి, ప్రభుత్వ విప్, మేడ్చల్ జిల్లా బీఆర్‌ఎస్ పార్టీ అధ్యక్షుడు ఎమ్మెల్సీ శంబీపూర్ రాజు, ఎమ్మెల్యే వివేకానంద్ ముఖ్యఅతిథులుగా హాజరై సభా ప్రాంగణంలో ఏర్పాటు చేసిన ‘ఫొటో గ్యాలరీ’ని వారు వీక్షించారు. కుత్బుల్లాపూర్ నియోజకవర్గంలో గడిచిన 9 ఏళ్లలో రూ.6 వేల కోట్లతో కుత్బుల్లాపూర్ నియోజకవర్గంలో చేసిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ఈ ఫొటోలు తెలుపుతున్నాయి.

అమరవీరుల త్యాగాలను స్మరిస్తూ..

◆ అనంతరం గులాబీ జెండాను ఆవిష్కరించి తెలంగాణ తల్లి చిత్రపటానికి పూలమాలలు వేశారు. సభలో ఏర్పాటు చేసిన అమరవీరుల స్థూపం వద్ద నివాళులర్పించారు. వారి త్యాగాలను స్మరిస్తూ రెండు నిమిషాలు మౌనం పాటించారు.

60 లక్షల సభ్యత్వాలు కలిగిన ఏకైక పార్టీ..

బీఆర్‌ఎస్ పార్టీ శ్రేణులను ఉద్దేశించి ఎమ్మెల్సీలు, ఎమ్మెల్యే మాట్లాడుతూ కార్యకర్తలే బీఆర్‌ఎస్‌కు ఊపిరి అని, కార్యకర్తలు లేకపోతే పార్టీయే లేదన్నారు. సేవా భావం, క్రమశిక్షణ, క్రియాశీలకంగా పని చేసే 60 లక్షల సభ్యత్వాలు కలిగిన ఏకైక పార్టీ బీఆర్‌ఎస్ అని అన్నారు.సీఎం కేసీఆర్‌ను ఎదుర్కొనే దమ్ము, ధైర్యం దేశంలో ఏ పార్టీనేతకు లేదన్నారు.

◆ బీఆర్‌ఎస్ ప్రభుత్వంపై అసత్య ప్రచారాలు, తప్పుడు ఆరోపణలతో పబ్బం గడపడమే ప్రతిపక్షాల పని అన్నారు. నేడు ఏ రంగాన్ని తీసుకున్నా దేశానికే తెలంగాణ రాష్ట్రం ఆదర్శంగా నిలుస్తుందంటే అది సీఎం కేసీఆర్ గొప్పతనమన్నారు. ప్రశ్నిస్తే ఈడీ, ఐటీ, సీబీఐ దాడులు చేస్తూ బీఆర్‌ఎస్ నేతలను ఇబ్బందులకు గురి చేస్తున్నారని చెప్పారు. ఎన్నికలవేళ మాయమాటలు చెప్పి ప్రజలను మభ్య పెట్టేందుకు వచ్చే విపక్షాలకు చెంపపెట్టు సమాధానం చెప్పాలని అన్నారు. సోషల్ మీడియాలో చేసే అసత్య ప్రచారాలను ఎప్పటికప్పుడు తిప్పి కొట్టి వాస్తవాలను ముందుంచాలన్నారు.

◆ కుత్బుల్లాపూర్ నియోజకవర్గంలో గడిచిన తొమ్మిదేళ్లలో రూ.6వేల కోట్లతో చేసిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను గడపగడపకు వివరించాలన్నారు. రాబోయే రోజుల్లో మూడోసారి గులాబీ జెండా ఎగిరేలా బీఆర్‌ఎస్ శ్రేణులు సమిష్టి కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో నిజాంపేట్ మేయర్, కొంపల్లి చైర్మన్, వైస్ చైర్మన్లు, జీహెచ్‌ఎంసీ కార్పొరేటర్లు, నిజాంపేట్ కార్పొరేటర్లు, పాక్స్ చైర్మన్లు, కౌన్సిలర్లు, మాజీ ప్రజా ప్రతినిధులు, మాజీ గ్రంథాలయ సంస్థ చైర్మన్, దుండిగల్ నిజాంపేట్ బీఆర్‌ఎస్ అధ్యక్షులు, నియోజకవర్గ యూత్ ప్రెసిడెంట్, బీఆర్‌ఎస్ పార్టీ అధ్యక్షులు, మున్సిపాలిటీల బీఆర్‌ఎస్ పార్టీ అధ్యక్షులు, మహిళా అధ్యక్షురాలు, నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

తుమార్ చెరువు రక్షణకు చర్యలు తీసుకోవాలి



మాజీ ఎమ్మెల్యే శ్రీశైలంగౌడ్ ఆధ్వర్యంలో నిరసన తెలుపుతున్న బీజేపీ శ్రేణులు

సుభాష్‌నగర్: బీఆర్‌ఎస్ ప్రజాప్రతినిధుల ఒత్తిడితోనే దూలపలి– బహదూర్‌పల్లి రోడ్డు విస్తరణను కుదించారని మాజీ ఎమ్మెల్యే కూన శ్రీశైలంగౌడ్ ఆరోపించారు. దూలపల్లిలోని తుమార్ చెరువును కాపాడాలని, కొంపల్లి క్రాస్ రోడ్డు నుంచి బహదూర్‌పల్లి క్రాస్ రోడ్డు వరకు 250 అడుగుల రోడ్డును 100 అడుగులకు తగ్గించడానికి వ్యతిరేకంగా మంగళవారం దూలపల్లిలో బీజేపీ చేపట్టిన ధర్నాకు ఆయన పాల్గొన్నారు.

ఈ సందర్భంగా శ్రీశైలంగౌడ్ మాట్లాడుతూ.. మంత్రి మల్లారెడ్డి, ఎమ్మెల్యే వివేక్, ఎమ్మెల్సీ శంబీపూర్ రాజుల ప్రోద్బలంతోనే కొంపల్లి క్రాస్ రోడ్డు నుంచి బహదుర్‌పల్లి క్రాస్ రోడ్డు వరకు మంజూరైన 250 ఫీట్ల రోడ్డును 100 ఫీట్లకు తగ్గించారన్నారు. అందులో కోట్ల రూపాయల అవినీతి జరిగిందన్నారు. తాను ఎమ్మెల్యేగా ఉన్నపుడు దూలపల్లిలోని పేదలకు ఇళ్ల పట్టాలు ఇచ్చానన్నారు. ఎమ్మెల్యే వివేక్ ఎన్ని ఇండ్ల పట్టాలు ఇచ్చాడో చెప్పాలన్నారు.

◆ ఇప్పటికైనా తుమార్ చెరువు రక్షణకు చర్యలు తీసుకోకపోతే బీజేపీ తరఫున ఆందోళనలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షులు విక్రమ్ రెడ్డి, బీజేపీ రాష్ట్ర మాజీ ఉపాధ్యక్షులు మల్లా రెడ్డి, నాయకులు రాజిరెడ్డి, జీవన్ రెడ్డి, జనార్దన్ రెడ్డి, సరితారావు, సంధ్యా రాణి, సతీష్, శివాజీ, శంకర్ నాయక్, దూలపల్లి బీజేపీ నాయకులు రమేష్, నర్సింహా, అశోక్, సత్యనారాయణ, శేఖర్, శ్రీనాథ్ తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ అధ్యాపకురాలు శోభారాణికి డాక్టరేట్



కూకట్‌పల్లి: కూకట్‌పల్లి ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఇంగ్లిష్ విభాగానికి చెందిన అధ్యాపకురాలు ఆర్. శోభరాణికి ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం డాక్టరేట్ ప్రదానం చేసింది. శోభరాణి ‘టెస్టింగ్ ఆఫ్ స్కిల్స్ ఇన్ ఈఎస్‌ఎల్ సిట్యుయేషన్’అనే అంశంపై పరిశోధన చేసి సిద్ధాంత గ్రంథాన్ని సమర్పించినందుకు ఆమెకు డాక్టరేట్ ప్రదానం చేశారు. ఈ సందర్భంగా మంగళవారం ఏర్పాటు చేసిన అభినందన సమావేశంలో కళాశాల ప్రిన్సిపల్ డా. ఎన్ అలివేలు మంగమ్మ మాట్లాడారు. ఎంతో వ్యయ ప్రయాసలు కోర్చి సిద్ధాంత గ్రంథాన్ని సమర్పించి డాక్టరేట్ పొందినందుకు శోభరాణిని అభినందించారు. అదే విధంగా ప్రతి అధ్యాపకులు ఆమెను స్ఫూర్తిగా తీసుకొని పరిశోధనలు చేయాలన్నారు. ఒక చిన్న పరిశోధన అనేక సమస్యలకు పరిష్కారం చూపుతుందన్నారు. అనేక కొత్త విషయాలను వెలుగులోకి తెస్తుందన్నారు. ఏ దేశంలో పరిశోధనలు బాగా జరుగుతాయో ఆ దేశం అభివృద్ధిలో ముందంజలో ఉంటుందన్నారు. ఈ కార్యక్రమానికి వైస్ ప్రిన్సిపాల్ డా. భవాని, డా.రమేష్ బాబు, డా. సాలయ్య, ఎన్.సురేష్, కరుణ, డా.కె. సుజాత, డా.పవన్‌కుమార్, డా.రాఘవేందర్, డా. ఐ.వాణి, రవికుమార్ పాల్గొన్నారు.

పాండుబస్తీలో అధికారుల పర్యటన



డ్రైనేజీ, తాగునీటి సమస్యపై జలమండలి మేనేజర్ రాజుకు వివరిస్తున్న పాండు బస్తీ వాసులు

చింతల్: జీడిమెట్ల డివిజన్ పాండు బస్తీలో మంగళవారం వాటర్ వర్క్స్ జీడిమెట్ల సెక్షన్ మేనేజర్ రాజు పర్యటించారు. పండుబస్తీలో నెలకొన్న భూగర్భ డ్రైనేజీ సమస్య, అదే విధంగా తాగునీటి సరఫరా కొనసాగుతున్న తీరుపై బస్తీవాసులు పలుమార్లు ఫిర్యాదు చేయడంతో మంగళవారం సిబ్బందితో కలిసి ఆయన పాండుబస్తీలో పర్యటించారు. మురుగు నిత్యం రోడ్లపై పారుతోందని స్థానికులు ఈ సందర్భంగా మేనేజర్ రాజుకు విన్నవించారు. బస్తీల్లో పాత పైపులైన్ల సామర్థ్యం సరిపోవడం లేదని.. కొత్త పైపులైన్ వ్యవస్థను ఏర్పాటు చేయాలని బస్తీ వాసులు కోరారు. డ్రైనేజీ సమస్యను ఉన్నతాధికారులకు నివేదించి త్వరలోనే కొత్త పైపులైన్ వేసేలా చర్యలు తీసుకుంటామన్నారు. అదేవిధంగా తాగునీటి సమస్యలపై ఫిర్యాదులు ఉంటే కార్యాలయంలో గాని, నేరుగా తనకు గాని విన్నవించినట్లయితే సమస్యను పరిష్కరిస్తామని ఆయన తెలిపారు.

బస్సు కండక్టర్‌పై దాడి

జగద్గిరిగుట్ట: అడ్డుగా ఉన్న ద్విచక్ర వాహనం తీయమన్నందుకు బస్సు కండక్టర్ దాడి చేసిన ఘటన జగద్గిరిగుట్ట పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసుల వివరాల ప్రకారం మంగళవారం సాయంత్రం 6 గంటల ప్రాంతంలో మెహదీపట్నం డిపోకు చెందిన బస్సు జగద్గిరిగుట్ట నుంచి బయలుదేరింది. డిపో ఎదురుగా ద్విచక్ర వాహనంపై ఇద్దరు వ్యక్తులు కూర్చున్నారు. అడ్డుగా ఉన్నందున ప్రక్కకు జరగమని బస్సు కండక్టర్ అడగగా మమ్మల్నే పక్కకు జరగమంటావా అని కండక్టర్‌పై పిడిగుద్దులు కురిపించారు. బస్సు అద్దాలను సైతం పగలగొట్టారు. ప్రయాణికులు, అక్కడున్న ఆర్‌టీసీ సిబ్బంది అడ్డుకోవడంతో గొడవ సద్దుమనిగినా తన తప్పు ఏమి లేకపోయినా కొట్టాడని కండక్టర్ తెలిపారు. వారిపై చర్య తీసుకోకుంటే బస్సులు కదలదని కండక్టర్ భీష్మించు కూర్చోవడంతో గంట పాటు తీవ్ర ట్రాఫిక్ జామ్ ఏర్పడింది. చివరకు పోలీసులు వచ్చి కండక్టర్ ఇచ్చిన ఫిర్యదుతో చర్య తీసుకుంటామని చెప్పడంతో గొడవ సద్దుమనిగింది.

కరపత్రం ఆవిష్కరణ

జగద్గిరిగుట్ట: ప్రజా సమస్యలపై కేంద్రంలోని బీజేపీ హఠావో – దేశ్ బచావో అనే నినాదంతో బుధవారం నుంచి ఇంటింటికీ సీపీఐ పేరుతో జరిగే పాదయాత్రను జయప్రదం చేయాలని సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి ఉమా మహేష్ అన్నారు. దీనికి సంబంధించిన కరపత్రాలను మంగళవారం జగద్గిరిగుట్టలోని సీపీఐ కార్యాలయంలో విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో సీపీఐ కార్యవర్గ సభ్యులు హరినాథ్, సహదేవ్, శ్రీనివాస్, పర్వీనా, సుల్తానా, మండల నాయకులు ఇమామ్, సుధాకర్, రాజు, నగేష్, చాంద్, కీర్తి, ప్రసాద్, నర్సమ్మ తదితరులు పాల్గొన్నారు.

భారీ వర్షం



జీడిమెట్ల: కుత్బుల్లాపూర్‌లో మంగళవారం రాత్రి తీవ్రమైన గాలులతో, ఉరుములతో కూడిన భారీ వర్షం కురిసింది. కుత్బుల్లాపూర్‌లోని పలు కాలనీలు నీటితో మునిగిపోయాయి. ప్రధాన రహదారులపై నీరు నిలిచింది. కొన్ని చోట్ల చెట్ల కొమ్మలు విరిగి రోడ్లపై పడ్డాయి. కాలనీల్లో కరెంట్ పోవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. కొన్ని చోట్ల చెట్ల కొమ్మలు విరిగి పడటంతో కరెంట్ వైర్లు తొగిపోయాయి. దీంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడ్డారు.

భారీ ట్రాఫిక్ జామ్



ప్రగతినగర్ ఏనుగుల బొమ్మల చౌరస్తా వద్ద నిలిచిన ట్రాఫిక్..

నిజాంపేట్: నిజాంపేట్ కార్పొరేషన్ పరిధి ప్రగతినగర్‌లోని ఏనుగు బొమ్మల సెంటర్ వద్ద మంగళవారం రాత్రి భారీగా ట్రాఫిక్ నిలిచిపోయింది. ఓ కారు రోడ్డుపైకి ఎక్కే సమయంలో స్పీడ్ బ్రేకర్ వద్ద మొరాయించడంతో వెనుక వచ్చిన వాహనాలు భారీ సంఖ్యలో నిలిచిపోయాయి. రోడ్డు ఎత్తుగా ఉండటంతో పాటు స్పీడ్ బ్రేకర్లు ఉండటంతో ప్రతిరోజు ఈ సమస్య తప్పడం లేదని పలువురు వాహనదారులు వాపోయారు.

పరిశ్రమలో గీజర్ పేలి కార్మికుడు మృతి

జీడిమెట్ల: గాంధీనగర్‌లోని ఓ పరిశ్రమలో గీజర్ పేలి వేడి నీళ్లు మీద పడటంతో ఓ కార్మికుడు మృతి చెందిన సంఘటన జీడిమెట్ల పీఎస్ పరిధిలో చోటు చేసుకుంది. ఇన్‌స్పెక్టర్ పవన్ తెలిపిన వివరాల ప్రకారం.. ఒడిస్సా రాష్ట్రానికి చెందిన బసంత్‌కుమార్ మహారాణా(28) గాంధీనగర్‌లో ఉంటూ అదే ప్రాంతంలోని ఫ్లోరోథర్మల్ పరిశ్రమలో కార్మికుడిగా పని చేస్తున్నాడు. శుక్రవారం బసంత్‌కుమార్ రోజు మాదిరిగా పరిశ్రమకు వెళ్లాడు. సాయంత్రం సమయంలో కాళ్లు, చేతులు కడుక్కునేందుకు పరిశ్రమ ఆవరణలోని బాత్‌రూంలోకి వెళ్లాడు. అప్పటికే బాత్‌రూంలో గీజర్ ఆన్ చేసి ఉంది. నీరు ఎక్కువగా వేడి కాడంతో బాత్‌రూంలో ఉన్న గీజర్ ఒక్కసారిగా పేలడంతో బసంత్‌కుమార్‌కు తీవ్ర గాయాలయ్యాయి. వెంటనే బసంత్‌ను పరిశ్రమ సిబ్బంది చికిత్స నిమిత్తం గాంధీ ఆస్పత్రికి తరలించారు. నాలుగు రోజులుగా అక్కడే చికిత్స పొందుతున్న బసంత్ మంగళవారం తెల్లవారుజామున మృతిచెందాడు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

విషయం బయటకు రాకుండా దాచిన యాజమాన్యం

బసంత్ కుమార్ వేడి నీళ్లు పడిన విషయం గాంధీ ఆస్పత్రి సిబ్బంది ద్వారా పోలీసులకు సమాచారం అందింది. పరిశ్రమ యాజమాన్యం జరిగిన విషయాన్ని పోలీసులకు చెప్పకుండా దాచి ఉంచారు. బాధితుడికి 40శాతం కాలిన గాయాలు అయినట్టు డాక్టర్లు తెలిపారు. పొట్టకూటి కోసం నగరానికి వచ్చిన బసంత్ మృతిచెందడంతో బసంత్ భార్య మూడు నెలల కుమారుడితో ఎలా బతకాలి అని రోదించిన తీరు అందరినీ కలచివేసింది. దీనిపై స్పందించిన పరిశ్రమ యాజమాన్యం రూ.11లక్షల నష్టపరిహారాన్ని మృతుడి కుటుంబానికి ఇస్తామని హామీ ఇచ్చారు.

ఆర్టిజెన్లకు 50శాతం పీఆర్సీ చెల్లించాలి

- బీజేపీ నాయకుడు కూన శ్రీశైలంగౌడ్
- ఔట్ సోర్సింగ్ ఉద్యోగుల నిరసనకు సంఘీభావం



జీడిమెట్ల పీఎస్‌లో నిరసన వ్యక్తం చేస్తున్న విద్యుత్ ఉద్యోగులు



జీడిమెట్ల ఠాణాలో విద్యుత్ ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులతో మాట్లాడుతున్న శ్రీశైలంగౌడ్

జీడిమెట్ల: రాష్ట్ర ప్రభుత్వం విద్యుత్‌శాఖలో పనిచేస్తున్న ఆర్టిజెన్‌లకు 50శాతం పీఆర్సీ చెల్లించాలని కుత్బుల్లాపూర్ మాజీ ఎమ్మెల్యే, బీజేపీ నాయకుడు కూన శ్రీశైలంగౌడ్ డిమాండ్ చేశారు. తెలంగాణ విద్యుత్‌శాఖలో ఔట్ సోర్సింగ్ ఉద్యోగులు తమ సమస్యలు పరిష్కరించాలని మంగళవారం సమ్మెకు పిలుపునిచ్చారు. దీంతో కుత్బుల్లాపూర్ పరిధిలో పని చేస్తున్న 70మంది ఉద్యోగులను పోలీసులు వారి ఇళ్ల వద్ద సోమవారం రాత్రి నుంచే అరెస్టులు చేసి జీడిమెట్ల ఠాణాకు తరలించారు. దీంతో విద్యుత్ ఉద్యోగులంతా జీడిమెట్ల పీఎస్‌లోనే వారి నిరసన వ్యక్తం చేశారు. విషయం తెలుసుకున్న శ్రీశైలంగౌడ్ బీజేపీ నాయకులతో కలిసి జీడిమెట్ల ఠాణాకు చేరుకుని వారికి సంఘీభావం తెలియజేశారు.

◆ అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ విద్యుత్ ఔట్ సోర్సింగ్ ఉద్యోగులు సమస్యలు పరిష్కరించమని అడగడం కూడా తప్పేనా అని ప్రశ్నించారు. కేసీఆర్ ప్రభుత్వం పోలీసులను వాడుకుని ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేస్తోందన్నారు. విద్యుత్ శాఖలో పనిచేస్తూ ఐడీ నంబర్లు ఉన్న వారందరిని ఆర్టిజెన్‌లుగా గుర్తించాలని ఆయన డిమాండ్ చేశారు.

బీఆర్‌ఎస్‌కు రాష్ట్రంలో నూకలు చెల్లాయి..

ప్రజాస్వామ్యంలో ఏదైనా పార్టీ నియంత పోకడకు పోతే పేకమేడలా కుప్పకూలి పోవాల్సిందేనని ఆయన బీఆర్‌ఎస్ పార్టీపై మండిపడ్డారు. తెలంగాణలో దోచిన సొమ్మంతా తీసుకెళ్లి కేసీఆర్ తాను జాతీయ నాయకుడినని నిరూపించేందుకు ఇతర రాష్ట్రాల్లో ఖర్చు పెడుతున్నాడని విమర్శించారు. రాష్ట్రంలో హిట్లర్ పాలన కొనసాగుతోందన్నారు.

షర్మిల అరెస్ట్ అప్రజాస్వామ్యం..

షర్మిలపట్ల పోలీసులు దురుసుగా ప్రవర్తించి ఆమెను జైలుకు పంపించడం హీనమైన, పిరికిపంద చర్య అని శ్రీశైలంగౌడ్ మీడియాతో అన్నారు. ఒక ఆడపడుచు పార్టీ అధ్యక్షురాలు అని తెలిసి ఇలా ప్రవర్తించడం తగదన్నారు. నీ బిడ్డ కవిత అయితే ఒకలా షర్మిలా అయితే మరోలానా అని ప్రశ్నించారు. ప్రజలు మొత్తం గమనిస్తున్నారని అన్నారు. నీ కుమారుడు కేటీఆర్, నీ అల్లుడు పోలీసులను దూషించినందుకు వారిని ఏ జైలుకు పంపాలో కేసీఆర్ చెప్పాలన్నారు.

మేడ్చల్ విద్యుత్ సబ్‌స్టేషన్ ఎదుట ఆందోళన



మేడ్చల్ విద్యుత్ సబ్‌స్టేషన్ ఎదుట ఆందోళనకు దిగిన విద్యుత్ ఆర్టిజన్ ఉద్యోగులు..

కుత్బుల్లాపూర్: తెలంగాణ విద్యుత్ ఆర్టిజన్ ఉద్యోగుల సమస్యల సాధనకై మంగళవారం నుంచి నిరవధిక సమ్మెలో భాగంగా వెన్నెలగడ్డలోని మేడ్చల్ విద్యుత్ సబ్‌స్టేషన్ వద్ద కార్మికులు ఆందోళన చేశారు. ప్రభుత్వం కార్మికుల సమస్యలను పట్టించుకోకుండా నిర్లక్ష్యం చేస్తున్న నేపథ్యంలో తమ ఆందోళనను ఉధృతం చేస్తామని హెచ్చరించారు. డివిజన్ పరిధిలో మొత్తం 200మందికి పైగా కార్మికులు ఉన్నారని వారికి ప్రభుత్వం ఇచ్చిన హామీలను నెరవేర్చే దాకా ఈ సమ్మె కొనసాగుతుందని స్పష్టం చేశారు.తెలంగాణ విద్యుత్ ఎంప్లాయీస్ యూనియన్ ప్రతినిధులు హరి, రాము, రాజు, బాలరాజు, యాదగిరి, సంపత్ సమ్మెలో పాల్గొన్నారు.